# భగ్నదర్పణం

రచయిత:

సి. యస్. శర్మ.

చుక్కల్ని చూస్తూ డాబామీద పడుకున్నాను.

నాలుగువైపులనుంచీ నల్లని మేఘాలు వచ్చి నక్షత్రాల్ని ఆర్పేశాయి.

పెద్దగాలి వీచింది.

బొటబొటమని చినుకులు పడ్డాయి.

గబగబా కిందికి దిగి, తలుపు లేశాను.

గాలి గదిలోకి చొరబడి దీపాన్నార్పేసింది.

చీకట్లో తడుముకుంటూ నిప్పుపెట్టెని వెదికి దీపాన్ని వెలిగించాను.

నిద్రరాదు.

ఏదేనా చదువుకుందామంటే కళ్ళునొప్పులు!

తలుపులన్నీ వేసి మంచంమీద కూర్చుని నా 'ఫోటో' నిచూస్తో, ఏదో ఆలోచిస్తున్నాను.

ఆ నిర్మల ముఖవర్చస్సు,-కళ్ళల్లో ఆకళ,—ఎల్లా వెలిగేవాణ్ని!

ఇప్పుడల్లా వున్నానా?

నా నవ్వుల్ని నేను చూడాలని బుద్ధి పుట్టింది.

అద్దంకోసానికి ఇల్లంతా గాలించాను.

ధూళితో నిండిన భగ్నదర్పణం అగుపించింది.

అద్దాన్ని బాగా తుడిచి, దీపాన్ని పెద్దదిచేసి నాప్రతిబింబాన్ని చూస్తోన్నాను.

ఏమిటిది?

నాదేనా ఆప్రతిబింబం!

ఊహూ! నేను నమ్మను!

ఆ కళ్ళల్లో నవ్వులు వినిపించటంలేదేం!

ఆ లోతుకు పోయిన నేత్రాలు, మాసినగడ్డం, నెరసిన బిరుసయిపోయిన జుత్తు!...ఛీ! నావికావు—ఏదో పశువువి!

కళ్ళు పెద్దవిగచేసి చూశాను.

మరీ బీభత్సంగవుంది రూపు.

నా ఫోటోని చూశాను.

ఎంత ప్రశాంతంగవుంది ఆ చిత్రం!

అద్దం మంచిదికాదేమో!

నాస్నేహితులందరూ నన్ను చూసి నవ్వడంలేదే! పూర్వంలాగే గౌరవిస్తున్నారే మరి!

ఇంత కుళ్ళుకంపు కొడ్తున్న-పశువునిలోకం ఎల్లా భరిస్తోంది!

అద్దాన్ని స్పిరిట్‌తో కడిగాను.

మరీ అసహ్యం కలిగిందిచూస్తే!

* * *

అద్దాల మేడలో మేం విహరిస్తున్నప్పుడు కొనుక్కున్నాం ఆ అద్దాన్ని.

ఆ అద్దంలో మా ప్రతిబింబాల్ని చూసి మురిసి పొయ్యేవాళ్ళం.

కాలం మళ్ళింది.

కర్మం కుళ్ళింది.

వాళ్ళందరూ గతించారు.

వాళ్ళతోపాటు నాభాగ్యం బుగ్గయిపోయింది.

మిగిలిపోయాను ఒక్కణ్ణీ!—రాంబందులాగ!

ఈ పిశాచరూపాన్ని చూసి మృత్యువుకూడ భయపడిందేమో! దూరమౌతోంది—ఎప్పటికీ కౌగిలించుకోదు!!

ప్రతిబింబాన్ని చూస్తున్న కొద్దీ, నా నరాల్లో రక్తం ఉడుకెత్తి, రౌద్రాన్ని రేకెత్తించింది.

ముక్క ముక్కలుగ చేశాను అద్దాన్ని.

ఆకాశాన ఉరుములు ప్రతిధ్వనించాయి.

పది ముక్కల్లోనూ ప్రతి బింబించింది పాడురూపు—దెయ్యం నవ్వు నవ్వుతూ!

ఉద్రిక్తుణ్ణయిపోయి పెద్ద కేక వేశాను.

కృంగిపోయింది గుండె.

స్పృహతప్పి పడిపోయాను.

దాసీ తలుపుకొడ్తే తెలివి వచ్చింది ఏడుగంటలకి.

నాచుట్టూ పడివున్న అద్దం ముక్కల్నీ, మండిపోతున్న దీపాన్నీ, మసెక్కిన దీపంచిమ్నీని, చూసి ఆశ్చర్యపోయింది.

భయకంపితున్నాయి

పారిపొయ్యానక్కణ్ణుంచి!

పిరికివాణ్ణా?

ప్రేమికుణ్ణా? ఏమో!

# రేడియో ప్రభావం

## గాలికూతలు

'ఇక మనం మనదేశంలోని రేడియో నిలయముల కార్యకలాపం గూర్చి పరికించవలసి యున్నది.'

రచయిత:

## సాకాశం వేమయ్య

ఇటీవలనే B B C అనగా బ్రిటిష్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్ కి 18 ఏళ్ళు నిండి ప్రగల్భ అయింది. అంతః పూర్వమే అమెరికాలో రేడియో పెనవేసికొని ఉండింది. బ్రిటన్ లో రేడియో గబాగబా వ్యాపించింది. ఈరోజున ఒక కోటి రేడియోసెట్లు ఇంగ్లండులో ఉన్నాయి. అన్ని దేశాలలోని రేడియో సంస్థలకు 1922 లగాయతు B B C దారిచూపుతూ వచ్చింది.

* * *

ఎవరూ కననిది, విననిది ఊహించనిది ఈ రేడియో. ఇది నేలమీద నిలచేప్పటికి ఒక కొత్త చైతన్యం వెలసినట్లయింది. జనగణపు బుద్ధిమత్త యొక్క విస్ఫారానికి ఇది అసదృశంగా తోడ్పడసాగింది. వన్నె చిన్నెలతో చిలవలు పలవలుగా ప్రతి విషయంలోను కొత్త దార్లు తీస్తూ ఎల్లరకూ కర్ణపేయంగా వినుకలికి కారణమైంది.

* * *

మన దేశంలో రేడియో ఆరంభించి దరిదాపుగా పదియేళ్లు అవుతున్నది. మన రాజధానిలో ఈ బొమ్మదేవతకి మొన్న జూన్ లో రెండో పుట్టినరోజు నీళ్ళుపోశారు. ఇదే రాజధానిలో తిరుచునాపల్లిలో రేడియో నివేశనం వెలసి యేడాదిపైగానే అయింది. ఢిల్లీ, (బెంగాల్) కలకత్తా, ఢకా; చెన్నపట్నం, తిరుచునాపల్లి, బొంబాయి, పెషావర్, లాహోర్, లక్నో నగరాలలో ఆయా ప్రాంతాలకు రేడియో నివేశనాలు వెలసి ఉన్నవి. ముఖ్యమైన దేశభాషలన్నీ రేడియోలో ఉపయోగం అవుతూ ఉన్నవి-

ఈరోజున ఈ దేశంలో లక్షకి పైగా రేడియోసెట్లు ఉన్నాయి. ఆంధ్రదేశంలో రెండు వేలుగూడా లేవు. తమిళనాడులో వేలకొద్దీ ఉన్నవి.

పైన పేర్కొన్న రేడియో నిలయాలన్నీ ఈ దేశంలోని బ్రిటిష్ ప్రభుత్వంచే ప్రతిష్ఠింపబడి ఉన్నవని మనం గమనించవలె.

అన్నట్లు యివిగాక మైసూరులోను హైదరాబాదులోను ఆ సంస్థాన ప్రభుత్వములు రేడియో నిలయములు యేర్పాటుచేసి యున్నవి.

* * *

మనం విమర్శ అనేది కేవలంగా చేసి ప్రయోజనం ఉండదు. మన దేశంలో మనమే పంజరంలోని చిలుకలాగా అస్వతంత్రులంగా పరదాసులంగా ఉంటున్నామనే సంగతి మరచిపోకూడదు. ప్రజకి సంబంధించిన ప్రతీ విషయంలోను ఈ పరాధీనతయొక్క కారు నలుపు నీడ కనబడుతూ ఉంటుంది. రేడియో ఇందుకు ప్రబలమైన తార్కాణం.

* * *

మన మనస్సు దాస్యవాసనలను సాత్తుకుంటూ ఉన్నంతకాలం మనకి అభ్యుదయమూ ఉండదు, అభివర్థనమూ ఉండదు.

* * *

ఈ 'రేడియో ప్రోగ్రామ్'లలో సంగీతం హెచ్చుగా ఉండి ప్రసంగాలు, నాటికలు, కథలు మున్నగునవి తక్కువగా ఉంటున్నవి. రేడియో ముఖ్యంగా వినోదార్థమే

[మిగతా ౧౦౦-వ పేజీలో,